క్లుప్తంగా

సంచార జాతులకు దోమతెరలు పంపిణీ



తెనాలి: అగాపె లవ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వీఎస్సార్ కాలేజీ ఎదురుగా కఠెవరం కాల్వకట్టపై నివసిస్తున్న సంచార జాతులకు చెందిన ఎనిమిది కుటుంబాలకు ఉచితంగా దోమతెరలను పంపిణీ చేశారు. రెవరెండ్ విక్టర్ పాల్ సహకారంతో సంస్థ నిర్వాహకులు డాక్టర్ పల్లికొండ రవికుమార్ వీటిని అందజేశారు. లబ్ధిదారులు దోమతెరలను తప్పక ఉపయోగించుకుని, దోమల నుంచి రక్షణ పొందాలని సూచించారు. 'క్లాప్స్' సొసైటీ అధ్యక్షుడు ఉప్పలపాటి గోవిందు మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామని తెలియజేశారు. సోషల్ వర్కర్ బడుగు రత్నకుమార్ మాట్లాడుతూ అగాపే లవ్ ట్రస్ట్ సేవలనుఅభినందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు గంగోలు శ్రీలత, పల్లికొండ ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.

ఐఎంఏ క్యాలెండర్ ఆవిష్కరణ



తెనాలి రూరల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెనాలి శాఖ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. స్థానిక బోస్ రోడ్డులోని ఐఎంఏ కార్యాలయంలో శనివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ప్రముఖ ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ డాక్టర్ జగదీష్, ఐయంఏ తెనాలి అధ్యక్షుడు డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ పావని ప్రియాంక, డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, డాక్టర్ చందు సాంబశివుడు డాక్టర్ మధుప్రభాకర్‌బాబు, డాక్టర్ ఉదయ భాస్కర్ పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా నందకిశోర్

తెనాలి రూరల్: బీజేపీ తెనాలి మండల అధ్యక్షుడిగా కడియాల నందకిశోర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో ఆయన ఏకగ్రీవంగా రెండోసారి ఎన్నికైనట్టు ఎన్నికల అధికారులు టి. కృష్ణారెడ్డి, టి. రఘు, శివపార్వతి తెలిపారు. అసెంబ్లీ కన్వీనర్ కఠారి వాసుదేవనాయుడు పర్యవేక్షించారు.

ప్రభుత్వ శాఖల ఉద్యోగుల సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ



తెనాలి: ఆంధ్రప్రదేశ్ ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ డిపార్ట్‌మెంట్స్ మెయింటెనెన్స్ అండ్ ప్రాజెక్ట్ ఎస్టాబ్లిష్‌మెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్, అమరావతి సర్వసభ్య సమావేశం తెనాలిలోని రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎం.శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. 2025 సంవత్సర నూతన డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బీవై సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్.డబ్ల్యూ రెహాన్, కోశాధికారి షేక్ నూరుద్దీన్, యూనియన్ రాష్ట్ర నాయకులు ఆర్‌వీ రాఘవయ్య, కె.రామమోహనరావు, పి.సత్యనారాయణ, కె.రాఘవ స్వామి పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలు ప్రజల ఆస్తి

పట్టణ సీఐ మల్లికార్జునరావు

రేపల్లె రూరల్: ప్రభుత్వ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచాలని పట్టణ సీఐ మల్లికార్జునరావు సూచించారు. పట్టణంలోని సర్కిల్ కార్యాలయ ఆవరణంలో పోలీసు సిబ్బందితో ఆదివారం పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు వ్యర్థ పదార్థాలను చెత్త కుండీలలో మాత్రమే వేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలంటే ప్రజల ఆస్తి అని స్పష్టం చేశారు. కార్యాలయ ఆవరణంలో చెత్త, నిరుపయోగంగా ఉన్న బోర్డులు, పిచ్చి మొక్కలను తొలగించారు. ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

రేపల్లెరూరల్: పట్టణాభివృద్ధిపై పాలకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పట్టణ ఆదర్శ వేదిక కన్వీనర్ యడ్లపల్లి కిషోర్‌బాబు అన్నారు. పట్టణంలోని 7వ వార్డులో ఉన్న ఆదర్శ వేదిక కార్యాలయంలో ఆదివారం ఆదర్శ వేదిక కమిటీ సమావేశం నిర్వహించారు. పాలకులు పట్టణాభివృద్ధిపై తీసుకోవాల్సిన పలు అంశాలను ప్రస్తావించారు. గతంలో రేపల్లె నియోజకవర్గంలో పనిచేసిన ప్రజాప్రతినిధులు అనేక విధాలుగా పట్టణాభివృద్ధి చేశారని గుర్తుచేశారు. పట్టణాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించే విధంగా ప్రస్తుత పాలకులు కృషి చేయాలని కోరారు. నిధులతో డివిజన్ ప్రధాన కేంద్రమైన రేపల్లె రూపురేఖలు మార్చాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సభ్యులు కె.సుబ్బారావు, మోహనరావు, గుంటి సాంబశివరావు, సాయికృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

గ్రామస్తులకు చుక్కనీరు కరువు

- పెదరావూరులో అలంకారప్రాయంగా ఓవర్ హెడ్ ట్యాంకు
- రూ. 48.75 లక్షలతో నీటి సరఫరా వ్యవస్థను ఏర్పాటు చేసిన అధికారులు
- ప్రారంభించి 13 ఏళ్లయినా ప్రజలకు చుక్క నీరు ఇవ్వని వైనం



పెదరావూరులోని ఓవర్‌హెడ్ ట్యాంకు



చోరీకి గురైన తాగునీటి పంపు, మోటారు

తెనాలిరూరల్: అధికారుల అలసత్వమో లేక నిధులు ఖర్చు చేసేయాలన్న తపనో తెలియదు గానీ సుమారు రూ. అర కోటి ఖర్చు చేసిన పథకం అలంకారప్రాయంగా మిగిలిపోయింది. మనిషికి ఎంతో ముఖ్యమైన తాగునీరు అందించే ఈ పథకం చేపట్టి నిధులు ఖర్చు చేశారు మినహా దానివల్ల ఫలితం మాత్రం లేకుండా పోయింది. ప్రజల నుంచి స్పందన లేకపోవడం, చేసేది లేక అధికారులూ చేతులెత్తేయడంతో గ్రామాన్ని ఎత్తయిన ప్రదేశం నుంచి చూసేందుకు ఓవర్ హెడ్ ట్యాంకు, పెంపుడు జంతువులను కట్టేసుకోవడానికి పబ్లిక్ కుళాయిలు పనికొస్తున్నాయి మినహా ఖర్చు చేసిన నిధులన్నీ నీళ్ల పాలయ్యాయి. తెనాలి మండలం పెదరావూరు గ్రామంలో గతంలో అభివృద్ధి పరుగులెత్తింది. పట్టణ వాసులకు ఉండే సౌకర్యాలు గ్రామస్తులకు అందుబాటులోకి తెచ్చేందుకు అప్పటి పాలకులు, అధికారులు తీవ్రంగా కృషి చేశారు. ఫలితంగా గ్రామంలో డిజిటల్ లైబ్రరీ, మినరల్ వాటర్ ప్లాంట్ వంటి సౌకర్యాలు కల్పించారు. ఈ మినరల్ వాటర్ ప్లాంట్ ద్వారా రూ. రెండుకే 20 లీటర్ల శుద్ధి చేసిన నీటిని అప్పట్లో ఇచ్చారు. ఇది కాక, గ్రామ ప్రజల తాగునీటి అవసరాలకంటూ యాక్సలరేటెడ్ రూరల్ వాటర్ సప్లయ్ (ఏఆర్‌డబ్ల్యూస్), భారత్ నిర్మాణ్ నిధులు రూ. 29.75 లక్షలతో 2008 నవంబరులో రక్షిత మంచినీటి పథకం పనులకు అప్పటి ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ శంకుస్థాపన చేశారు. తదనంతరం ఎన్నికల కోడ్ రావడం, పనులు నిదానంగా సాగడం వంటి కారణాలతో మూడేళ్లపాటు సాగిన పనులు 2011లో పూర్తయ్యాయి. ఓవర్‌హెడ్ ట్యాంకుతో పాటు, పబ్లిక్ కుళాయిలనూ ఏర్పాటు చేసి, శాసనసభాపతి హోదాలో మనోహర్ దీనిని ప్రారంభించారు. నిర్మాణానికి మూడేళ్లు పట్టడంతో 2008 నాటి అంచనాలను పెంచారు. మొత్తం రూ. 48.75 లక్షలు ఈ పథకం కోసం ఖర్చు చేశారు. అక్కడ సీన్ కట్ చేస్తే, 13 ఏళ్లయినా ఇప్పటికీ ఈ పథకం ద్వారా ఒక్క చుక్క నీరు ఇచ్చిన దాఖలాలు లేవు. ట్యాంకు, కుళాయిలు కేవలం అలంకారప్రాయంగా మారాయి. ఇప్పటికీ పైపులైన్ల నిర్మాణం పూర్తికాలేదు.

గ్రామంలో దాదాపుగా అందరి ఇళ్లలో తీగునీటి చేతి పంపులు ఉండడం వల్ల పథకానికి ప్రజల నుంచి స్పందన లేకపోవడం, ఇళ్లకు కుళాయి కనెక్షన్‌లు తీసుకోకపోవడం, అధికారులూ ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో పథకానికి ఖర్చు చేసిన నిధులన్నీ నీళ్లపాలయ్యాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. శుద్ధి చేసిన తాగునీరు ఉచితంగా అందించాల్సిన అధికారులు, పాలకులు, అప్పట్లో గ్రామంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంటు నుంచి తాగు నీరు కొనుక్కోమని చెప్పడం కొసమెరుపు. మరోవైపు ఈ పథకం కింద గ్రామంలోని ఇళ్లకు కుళాయిలు ఇచ్చేందుకు హెచ్‌డీపీఈ పైపులు వాడారు. అవి గ్రామంలో కేబుల్, ఇతర అవసరాల కోసం జరిగిన తవ్వకాల్లో దెబ్బతిన్నాయి. గతంలో ఈ ఓవర్ హెడ్‌ట్యాంకు నుండి మినరల్ వాటర్ ప్లాంటుకు నీరు సరఫరా చేసే వారు. ప్రస్తుతం ట్యాంకు ఆవరణలో చేతి పంపు, మోటారు అపహరణకు గురయ్యాయి. 13 ఏళ్లుగా గ్రామంలో ఓ ట్యాంకు ఉందని చెప్పుకోడానికే మినహా చుక్క నీరు అందించిన పాపాన పోలేదని గ్రామస్తులు చెబుతున్నారు. రక్షిత మంచినీటి సరఫరా పేరిట దశాబ్దం క్రితమే రూ. అర కోటి వృథా చేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ట్యాంకు నిర్వహణ పేరిట బిల్లులు చెల్లించేసుకున్నారన్న ఆరోపణలూ లేకపోలేదు.

జల్‌జీవన్ మిషన్‌లో పెడతాం



గ్రామంలో రక్షిత మంచినీటి పథకం కింద నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకు వినియోగంలో లేదు. నేను ఇటీవలి కాలంలోనే గ్రామ కార్యదర్శిగా బాధ్యతలు తీసుకున్నా. రక్షిత మంచినీటి పథకాన్ని జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా తిరిగి అవసరమైన మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటాం.

– పి. దానయ్య, గ్రామ కార్యదర్శి, పెదరావూరు



ట్యాంకు నిర్మించిన ఆవరణలో ట్యాపు లేని పైపు

రక్త దానంపై అపోహలు వీడాలి

- వందసార్లు రక్తదానం చేసిన పోలిరెడ్డి ఉమామహేశ్వరరావు
- మానవత ఆధ్వర్యంలో జీవితకాల సాఫల్య పురస్కారం ప్రదానం



ఉమామహేశ్వరరావుకు పురస్కారం ప్రదానం

తెనాలి: రక్తదానంపై అపోహలు వీడాలని, రక్తదానం చేస్తే ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్న బాధితులను దోహదపడుతుందని రక్తదాత పోలిరెడ్డి ఉమామహేశ్వరరావు చెప్పారు. అందుకు తన జీవితమే నిదర్శనమన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఎందరికో రక్తదానం చేయడం వల్ల వారు ఆరోగ్యంగా జీవిస్తున్నారని తెలిపారు. నాలుగు దశాబ్దాల్లో వందసార్లు రక్తదానం చేసిన గుంటూరుకు చెందిన ఉమామహేశ్వరరావుకు ఆదివారం ఇక్కడ జరిగిన మానవత స్వచ్ఛంద సేవాసంస్థ సమావేశంలో జీవితకాల సాఫల్య పురస్కారం ప్రదానం చేసి, ఘనంగా సత్కరించారు. స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ లైబ్రరీ హాలులో ఏర్పాటైన సభకు మానవత చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ అధ్యక్షత వహించారు. పురస్కార గ్రహీత ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రక్తదానంతో శారీరకంగా బలహీనపడతామని చెప్పడం అపోహ మాత్రమేనన్నారు. వాస్తవానికి ఆరోగ్యవంతులు రక్తదానం చేయడం వల్ల తిరిగి రక్తం మెరుగవుతుందని స్పష్టంగా చెప్పారు. ఎలాంటి ప్రచారాలకు ప్రభావితం కాకుండా యువతరం రక్తదానం చేసి, ప్రాణదాతలు కావాలని సూచించారు. గత నలభై ఏళ్లలో తాను వందసార్లు రక్తదానం చేశానని, ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవని తెలిపారు. సానుకూల దృక్పథం అలవరచుకుని యోగా, ధ్యానం ఆచరిస్తుంటే మానసిక ప్రశాంతతను పొందవచ్చని అన్నారు. మానవత, తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ మాట్లాడుతూ పోలిరెడ్డి ఉమామహేశ్వరరావును రక్తదాతలకు బ్రాండ్ అంబాసిడర్‌గా అభివర్ణించారు. మానవత కార్యనిర్వాహక అధ్యక్షుడు ఓంకార్ ప్రసాద్ 2024లో మానవత కార్యకలాపాలను వివరించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పి.వెంకట్, ఉపాధ్యక్షుడు పి.వాసు, డీవీ సోమయ్య శాస్త్రి, ఎస్‌వీ శర్మ, సునీల్‌కుమార్, మువ్వా సత్యనారాయణ, ఆలపాటి వెంకట్రామయ్య, రాజశేఖర రెడ్డి, రోహిణి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



డీఎస్పీ జనార్దనరావు, రాములునాయక్‌కు సత్కారం

తెనాలి: స్మార్ట్ ఫోన్ల ఆధారంగా మోసగాళ్లు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని, ప్రజలు వీటిపై అప్రమత్తంగా ఉండాలని తెనాలి డీఎస్పీ బి.జనార్దనరావు సూచించారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం ఆదివారం సాయంత్రం స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్లో నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు మువ్వా సత్యనారాయణ అధ్యక్షత వహించారు. 'సైబర్ నేరాలు–అవగాహన' అంశంపై డీఎస్పీ జనార్దనరావు సభ్యులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఓటీపీ మెసేజ్‌లను ఎవరికీ షేర్ చేయరాదని హెచ్చరించారు. నిరక్షరాస్యులు, వృద్ధులతోపాటు చదువుకున్నవారు కూడా ఓటీపీలు చెబుతూ మోసపోతున్నారని చెప్పారు. బ్యాంకులు ఎప్పుడూ ఓటీపీలు అడగవని చెప్పారు. సైబర్ నేరగాళ్లు ఇప్పుడు డిజిటల్ అరెస్టుల పేరుతో భయభ్రాంతులను చేస్తూ డబ్బులు దండుకుంటున్న వైనాన్నీ వెల్లడించారు. అలాంటి ఫోన్లు వస్తే ఎవరూ భయపడొద్దనీ, 1930 నంబరుకు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. టూ టౌన్ సీఐ రాములు నాయక్ మాట్లాడుతూ డిజిటల్ అరెస్టులు, ఓటీపీల షేరింగ్‌తో తెనాలిలో జరిగిన మోసాలను వివరించారు. ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ తన ప్రసంగంలో సైబర్ నేరాలు, మోసగాళ్లు వ్యవహరిస్తున్న తీరును సోదాహరణంగా వివరించారు. కార్యదర్శి పూర్ణచంద్రరావు, కోటయ్య, చలమయ్య, ఆలి, శరత్, ఆదినారాయణ, కోటిరెడ్డి, శివరామయ్య, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. చివరగా అతిథులను సత్కరించారు.

యూటీఎఫ్ మహాసభల ప్రచార జాతా ప్రారంభం



ప్రచార జాతాను ప్రారంభిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నేతలు

తెనాలి: యూటీఎఫ్ స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభల ప్రచార జాతాను సంస్థ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం తెనాలిలో వైకుంఠపురం దగ్గర రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. జనవరి 5,6,7,8 తేదీల్లో కాకినాడలో జరగనున్న యాభై ఏళ్ల స్వర్ణోత్సవ యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్, పీడీఎఫ్ ఎమ్మెల్సీలు, విద్యావేత్తలు, ఆర్థికవేత్తలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. మహాసభలకు రాష్ట్రవ్యాప్తంగా 25 వేల కార్యకర్తలు హాజరవుతారని వెంకటేశ్వర్లు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు యు.రాజశేఖరరావు, జిల్లా కోశాధికారి ఎండీ గయాసుద్దౌలా, జిల్లా కార్యదర్శులు ఆదినారాయణ, కె.సాంబశివరావు, కె.కేదార్‌నాథ్, కె.కామాక్షి, జి.వెంకటేశ్వరరావు, బసవేశ్వరరావు, ఎండీ హుస్సేన్, మండల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

31న ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలి

తెనాలి రూరల్: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా తెనాలిలో మంగళవారం రాత్రి ప్రత్యేక ఆంక్షలు అమలు చేస్తామని త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్ బాబు తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ప్రజలకు పలు సూచనలు చేశారు. కొత్త సంవత్సర వేడుకలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. రాత్రి 12 గంటల తర్వాత రోడ్లపై తిరగవద్దని చెప్పారు. ఆ రోజు 30 పోలీస్ యాక్ట్ తో పాటు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, వ్యాపారస్తులు నిర్ణీత సమయంలోనే సంస్థలను మూసి వేయాలని చెప్పారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో సీఐతో పాటు ఎస్ఐ ప్రకాష్ పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణ సర్వే ఆడిట్ పత్రాలు సవరించాలి



సచివాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీయస్ నాయకులు

కొలకలూరు(తెనాలి): రూరల్ మండల గ్రామం కొలకలూరులోని గ్రామ సచివాలయంలో ప్రచురించిన కుల ధ్రువీకరణ సర్వే ఆడిట్ పత్రాల్లో క్రిస్టియన్–మాదిగగా నమోదు చేసిన పేర్లను హిందూ–మాదిగగా మార్చాలని ఎమ్మార్పీయస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గ్రామ సచివాలయం–2లో ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఎస్సీ వర్గీకరణపై ప్రజాభిప్రాయం తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ సభ్యుడు రాజీవ్‌రంజన్ మిశ్రా ఈనెల 30న గుంటూరు వస్తున్నట్టు తెలియజేశారు. గుంటూరు కలెక్టరేట్‌లో ఆరోజు ప్రజాభిప్రాయసేకరణ చేస్తారని తెలిపారు. ఈ నేపథ్యంలో కొలకలూరు సచివాలయాల్లో ప్రచురించిన కుల ధ్రువీకరణ సర్వే ఆడిట్ పత్రాల్లో చాలామంది పేర్లు క్రిస్టియన్–మాదిగగా నమోదై ఉన్నట్టు చెప్పారు. తక్షణమే సంబంధిత సమాచారాన్ని పరిశీలించి, గ్రామంలోని మాదిగ, మాదిగ ఉపకులాల జాబితాను హిందూ–మాదిగగా సవరించి గౌరవ కమిషన్‌కు, జిల్లా కలెక్టరుకు సమర్పించాలని కోరారు. ఎమ్మార్పీయస్ జాతీయ నాయకులు ఆలపాటి కరుణా మాదిగ, పొన్నెకంటి శోభిత్, మండల అధ్యక్షుడు మేరి ఆధ్వర్యంలో పొన్నెకంటి చక్రవర్తి, ఇనాయిస్ తదితరులు వినతిపత్రం అందజేశారు.

గౌతు లచ్చన్న విగ్రహానికి క్షీరాభిషేకం



గౌతు లచ్చన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న కేసన పమిడయ్య, నాయకులు

నిజాంపట్నం: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ సందర్భంగా నూజివీడులో చోటు చేసుకున్న ఘటన దురదృష్టకరమని బీసీ సంఘ నాయకుడు కేసన పమిడయ్య విచారం వ్యక్తం చేశారు. కూచినపూడి మెయిన్ సెంటరులో ఆదివారం సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. పమిడయ్య మాట్లాడుతూ కుల మత ప్రాంత రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల సంక్షేమం, సమాజ సాధికారితకు కృషి చేసిన వ్యక్తి గౌతు లచ్చన్న అని కొనియాడారు. అటువంటి గొప్ప వ్యక్తి విగ్రహాన్ని నూజివీడులో గౌడ సంఘీయులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తే.. రాజకీయాలకతీతంగా అన్నివర్గాల వారు హాజరయ్యారని చెప్పారు. కానీ, ప్రజాప్రతినిధులు సంకుచిత ధోరణితో స్పందించడం అనైతికమన్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘ నాయకుడు కేసన శంకరరావు పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా గౌతు లచ్చన్న విగ్రహాలకు నదీ జలాలు, పాలతో అభిషేకాలు నిర్వహించారు. బీసీ సంఘ నాయకులు కేసన సోమయ్య, బొర్రా సాంబశివరావు, బొర్రా రాఘవులు, కాంతారావు, గోపీ, లుక్కా సోమేష్, కే.హరిబాబు, యేమినేని వెంకటేశ్వరరావు, ఉప్పాల రమేష్‌బాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సంఘటిత పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



క్యాలెండరును ఆవిష్కరిస్తున్న సంఘ నేతలు

తెనాలి: శ్రీవిరాట్ విశ్వకర్మ ఉద్యోగ సంక్షేమ సంఘం, తెనాలి 2025 సంవత్సర నూతన క్యాలెండరు ఆవిష్కరణ ఆదివారం స్థానిక కొత్తపేటలోని కాకతీయ కో–ఆపరేటివ్ సొసైటీ సమావేశ మందిరంలో నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు పీఎస్సార్ బ్రహ్మచార్యులు అధ్యక్షత వహించారు. కాకతీయ కో–ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ డీఎల్ కాంతారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గొర్రెపాటి ప్రభాకర విశ్వకర్మ మాట్లాడుతూ, విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సమస్యలపై సంఘటితంగా పోరాడి పరిష్కరించుకోవాలని సూచించారు. పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు గుంటముక్కల వెంకట నాగార్జున, చెన్నుపల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చెన్నుపల్లి దుర్గాప్రసాదరావు, 'పోస్ట్' స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపకుడు టి.శ్రీనివాసబాబు పాల్గొన్నారు. విశ్వబ్రాహ్మణ వృద్ధులకు పొన్నపల్లి రాజేశ్వరి దుప్పట్లను పంపిణీ చేశారు. ఇరిగేషన్ శాఖ రిటైర్డ్ ఉద్యోగి కాకుమాను వెంకటసుబ్బారావు, డాక్టర్ బెల్లంకొండ వెంకట్‌ను సత్కరించారు. కార్యక్రమాన్ని సంఘ కార్యదర్శి బి.పరమేశ్వరరావు, శ్రీరాం దుర్గాప్రసాద్ పర్యవేక్షించారు.

యాదవ సంఘీయుల్లో ఐక్యత అవసరం



క్యాలెండరును ఆవిష్కరిస్తున్న జంగా కృష్ణమూర్తి

తెనాలి: ఆసేతు హిమాచలం యాదవులు విస్తరించి ఉన్నారని, ఐక్యంగా వ్యవహరించి అన్ని రంగాల్లో ఉన్నతస్థాయికి ఎదగాలని ఎమ్మెల్సీ, టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి తెలిపారు. చంద్రవంశ క్షత్రియ యాదవరాజుల 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. సంఘీయులు ఐక్యతగా వ్యవహరించాల్సిన ఆవశ్యకతను ఆయన వివరించారు. స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని టీజీకే కల్యాణ మండపంలో జరిగిన సభలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక రమేష్, న్యాయవాది తాడిబోయిన శ్రీనివాసరావు, డాక్టర్ తాడిబోయిన అవినాష్, 36వ వార్డు కౌన్సిలరు తాడిబోయిన బ్రహ్మేశ్వరరావు, విశ్రాంత డీఎస్పీ టి.రామకృష్ణ, పి.శ్రీనివాస్, కుర్రా శ్రీను, మల్లెబోయిన రాము, టి.బోసు, పి.మల్లికార్జునరావు, టి.లక్ష్మీనారాయణ, డి.శంకరరావు, కృష్ణ, ఈ.అంబరీషుడు, కేదార్‌నాథ్, రాజారావు, బి.వెంకట్రావు, తట్టుకూళ్ల అశోక్ యాదవ్ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన ఐలవరం పీడీ



పోల్‌వాల్ట్‌లో ప్రతిభ చూపి గోల్డ్‌మెడల్ సాధించిన శ్రీనివాసరెడ్డి (మధ్యలో)

భట్టిప్రోలు: గుంటూరులోని ఎన్టీఆర్ స్టేడియంలో శని, ఆదివారాల్లో జరిగిన ఆరవ ఏపీ మాస్టర్స్ అథ్లెటిక్ చాంపియన్ షిప్–2024లో ఐలవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఫిజికల్ డైరెక్టర్‌గా పని చేస్తున్న తుమ్మా శ్రీనివాసరెడ్డి 60 ప్లస్ విభాగంలో పోల్ వాల్ట్, లాంగ్ జంప్‌లలో సత్తా చాటారు. ప్రథమ స్థానంలో నిలిచారు. ఫిబ్రవరి ఒకటి నుంచి 3వ తేదీ వరకు కేరళలో జరిగనున్న జాతీయ స్థాయి పోటీలకు శ్రీనివాసరెడ్డి అర్హత సాధించారు. పోల్‌వాల్ట్‌లో 1.90 మీటర్లు, లాంగ్ జంప్‌లో 3.92 మీటర్లు దూకి గోల్డ్ మెడల్స్ సాధించారు. ఈ పోటీలలో 400 మంది రాష్ట్ర వ్యాప్తంగా స్త్రీ, పురుష, వెటరన్ అథ్లెటిక్స్ వివిధ విభాగాల్లో పాల్గొన్నారు. ఎంఈవోలు పులి లాజర్, నీలం దేవరాజు, ప్రధానోపాధ్యాయులు ఎం. మోహన్‌రావు, గ్రామ సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు మురుగుడు శ్రీనివాసరావు అభినందించారు.

ఐకమత్యమే మహా బలం

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎ.శ్యామలారెడ్డి



సభలో మాట్లాడుతున్న శ్యామలారెడ్డి

బాపట్ల: వివిధ రంగాల్లో స్థిరపడిన రెడ్డి ఆత్మీయ సోదరులు ఒకరికొకరు సహకరించుకోవడం ద్వారా సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా బలపడతారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరే శ్యామలారెడ్డి పేర్కొన్నారు. శ్యామల కోటిరెడ్డి అధ్యక్షతన రెడ్డి బిజినెస్ గ్రూపు నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రెడ్డి బిజినెస్ గ్రూపు వ్యవస్థాపకుడు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం జరిగింది. వివిధ రంగాల్లో స్వయం కృషితో ఎదిగి స్థిరపడిన రెడ్డి సామాజిక వర్గానికి చెందిన పలువురిని ఒకే వేదిక మీదకు తీసుకొచ్చారు. ఈ సమావేశంలో శ్యామలారెడ్డి మాట్లాడుతూ రెడ్డి సామాజికవర్గం తాము ఎదుగుతూ...ఎదుటివారి ఎదుగుదలను కోరుకుంటుందని చెప్పారు. సామాజిక అభివృద్ధికి అందరం కలిసి కృషి చేయాలని ఆమె సూచించారు. వరల్డ్ వైడ్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఉడుముల వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ దేశ విదేశాలలో విద్య అవకాశాల కోసం తన వంతు సహకారాన్ని అందిస్తానన్నారు. విజయవాడ పట్టణానికి చెందిన ప్రసిద్ధ బీఎస్ఆర్ జువెలర్స్ డైరెక్టర్ వింతా శ్రీనివాసరెడ్డి, మల్లారెడ్డి గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషన్ సంస్థల డైరెక్టర్ అన్నపురెడ్డి రామస్వామి రెడ్డి, రెడ్డి బిజినెస్ ఏనుగు శ్రీనివాసరెడ్డి తమ సేవలందిస్తామని తెలిపారు. సినీ నటుడు శ్రీ హర్షరెడ్డి ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆయన నటించిన లవ్ యు ఫాదర్ సినిమా సాంగ్ లాంచ్ చేశారు. రెడ్డి బిజినెస్ గ్రూపు సంస్థ నూతన సంవత్సర క్యాలెండర్‌ను శ్యామలారెడ్డి, శ్రీహర్షారెడ్డి ఆవిష్కరించారు. కుంచాల భూపతి రెడ్డి, మోదుగుల బసవపున్నారెడ్డి, నంగు గోవర్ధన్ రెడ్డి, మున్నం భోగేశ్వర రెడ్డి, కంటి వైద్యులు కొల్లి శివరామిరెడ్డి, గుంటూరు రెడ్డి హాస్టల్ సంజీవరెడ్డి, ఐ కోటా రహీం రెడ్డి, అడ్వకేట్స్ పిట్ల శ్రీనివాస్ రెడ్డి, భోగి రెడ్డి రమేష్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, సమ్మెట శ్రీనివాస్ రెడ్డి, దొంతిరెడ్డి ఏడుకొండలు, ఆక్వా వ్యాపారవేత్త అక్కల రమణారెడ్డి, గ్రామీణ వైద్యులు దుండి మస్తాన్ రెడ్డి, దిండు విష్ణువర్ధన్ రెడ్డి, సర్పంచి పిట్టు ఏడుకొండలు రెడ్డి పాల్గొన్నారు.

అద్దేపల్లిలో వరి కుప్ప దహనం



భట్టిప్రోలు: అద్దేపల్లికి చెందిన పీకే నారాయణ స్వామికి చెందిన ఎకరం వరికుప్పను గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం దహనం చేశారు. సుమారు రూ. 50 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. ఈ సందర్భంగా నారాయణ స్వామిని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి సుందరరావు, బీసీ సెల్ వేమూరు నియోజకవర్గ అధ్యక్షుడు బట్టు మల్లికార్జునరావు, వెల్లటూరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ యర్రంశెట్టి కరుణ శ్రీనివాసరావు, కార్యదర్శి పోకూరి సురేంద్ర, ఉపాధ్యక్షుడు జంగం శ్యాంసన్, తిరువీధుల బాలాజి పరామర్శించారు. వరికుప్పను పరిశీలించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు వారు తెలిపారు.

కమ్మేసిన పొగ మంచు



భట్టిప్రోలు: పొగ మంచు దట్టంగా కమ్ముకుంటోంది. భట్టిప్రోలు–బాపట్ల–వెల్లటూరు రహదారిలో బుధవారం ఉదయం 8 గంటలు దాటినా పొగ మంచు వీడలేదు. వాహన చోదకులు ఇక్కట్లకు గురవుతున్నారు. వాహనా లైట్ల వెలుగుల్లోనే నెమ్మదిగా వెళ్తున్నారు.